# కాఫీ రంగూ రుచీ

-- నిడదవోలు మాలతి, Madison, WI

ఈమధ్య అమెరికాలో ప్యాచిలఘోష ఎక్కువయిపోయింది. సిగరెట్లు మానేయడానికో ప్యాచీ, పడుకున్నప్పుడు గురక రాకుండా ఓప్యాచీ, పడుకున్నప్పుడే మరేదో రాకుండా మరో ప్యాచీ .. ఇలా నానా రకాలూలూ. కాఫీ మానేయడానికింకా ఏప్యాచీ కనిపెట్టినట్టు లేదు. కాని నాకు మాత్రం ఆ అదృష్టం మరోలా ప్రాప్తించింది.

నాక్కాఫీ యిష్టం. అంటే ఒట్టి ఇష్టం కాదు. పొద్దున్న లేస్తూనే మూడు కప్పుల కాఫీ పడకపోతే కాలకృత్యాలమాట ఒదిలేయండి అసలు తెల్లారినట్టే కాదు నాలెక్కలో. అమెరికాలో రెండేళ్లవాసం, ఒక ఇండియా ట్రిప్పూ సరిపోయాయి నాకాఫీ యావ మాఫీ చెయ్యడానికి.

అసలు మొదలెక్కడంటే, నేను ఓఏడాదిపాటు ఢిల్లీలో చదువ్వెలగబెట్టేను. అక్కడ వున్న ఏడాదిపాటూ ఆ పంజాబీసబ్జీల్లో వాళ్లు గుప్పించే పసుపూ, ధనియాలపొడీ భరించలేక, భోజనం మానేసి, ఎస్ప్రెసో కాఫీలూ గులాబ్‌జాములమీదే బతికేను.

కాఫీలో పాలూ, జాముల్లో పంచదారా హెచ్చయి. సన్నగా ఊచలా వున్న నేను చక్కగా పూరాగా గాలి పోసుకున్న గుమ్మటంలా తయారయేనని మాఅమ్మ మురిసిపోయిందనుకోండి. అది వేరే కథ.

అసలు కాఫీకి పెట్టింది పేరు మద్రాసీలది. కాని దాన్ని అరణం తెచ్చుకు దేశం నలుగడలా ప్రచారంలోకి తెచ్చిన ఘనత తెలుగువారిదే. మద్రాసు తెలుగువారిదే అంటూ ఎంత మొత్తుకున్నా మనకి దక్కలేదు. ఇప్పుడంటే తెలుగుకవులూ, గాయకులూ, నర్తకులూ హైదరాబాదులో తిష్ఠ వేసేరు కానీ మన రచయితలు చాలామంది, పోయినవారు పోగా మిగిలినవారు, ఇంకా ఇప్పటికీ మద్రాసులోనే మఠం వేసుక్కూచోలేదూ. ఎందుకనుకున్నారు? మద్రాసు మనదే కనక. ఐ మీన్ స్పిరిచ్యువల్లీ! మన స్పిరిటంతా ఇంకా అక్కడే వుంది. కాఫీ అందులో ముఖ్యభాగం. ఊరు దక్కించుకోలేకపోయాం కానీ కాఫీనీళ్లు హక్కుభుక్తం చేసేసుకున్నాం.

నాచిన్నప్పుడు తెల్లారగట్ల నాలుగ్గంటలకి లేచి, పాలవాడు గేదెనీ, చేటపెయ్యనీ తోలుకొస్తే, గుమ్మంలో నిలబడి పాలు పితికుంచుని గిన్నెలో పోయించుకొచ్చి అమ్మకిస్తే, అమ్మ పాలూ నీళ్లూ కలిపి ఇగరగాచి ముందు రాత్రి ఫిల్టరులో పెట్టి వుంచిన ిక్కని కషాయంలాటి డికాక్షను కలిపి స్టీలుగ్లాసులో పోసి అందించిన, పొగలు గక్కుతున్న కాఫీ తలుచుకుంటే నాకిప్పటికీ నాలుకమీద ఆరుచి తగులుతుంది.

ఇప్పుడా పాలూ లేవు, ఆకాఫీ లేదు. అమెరికా రాగానే తెలిసింది ఇక్కడ కాఫీఫిల్టరులు వుండవు కాఫీ మేకరులే కానీ. కాఫీపొడి కూడా మనదేశంలోలా ఘుమఘుమలాడుతూ వుండది. మొదట్లో టీవీలోనూ, పేపరులోనూ కనిపించి ప్రతి ప్రకటనా చూడ్డం, ఇది బావుంటుంది కాబోలనుకుని ఆవురావురంటూ కొనుక్కురావడం, తీరా ముందు సారి కొన్న పొడి కంటె ఇదేం పొడిచేయలేదని ఆలస్యంగా గ్రహించడం, ఇన్ని డాలర్లోసి (అంటే అంతకు ముప్పై రెట్లు రూ.లు పోసి) కొన్నా కదా అని పారేయలేకా, మింగలేకా కొట్టుకుచావడం, ఆపైన ఖర్చులు చూసుకుంటే నేను కొంటున్న కూరా, నారా, ఉప్పూ, పప్పూ కన్నా కాఫీకి తగలేస్తున్న డబ్బే ఎక్కువ అని తెలుసుకోడం జరిగింది.

ఇక్కడికి రాగానే ఎదురయే మరో ప్రశ్న కాఫీ బ్లాకా వైటా అన్నది. కాఫీ కాఫీరంగే కదా అనడక్కండి అమాయకంగా. ఎవరింటికైనా వెళ్తే, చల్లని క్రీము (పాలే) ఇస్తారు. హోటల్లో అయితే వైటెనరు అని ఓపొట్లం ఇస్తారు పాలకి బదులు. ఆపొడి కలుపుకుంటే కాఫీ వైటవదు. చూడ్డానికి బ్రౌనుగానూ, నోట బెడితే తుమ్మజిగురులా అంటుకోస్తూనూ చిరాగ్గా వుంటుంది. కాఫీమీద మమకారం నశించడానికి ఇది ప్రథమపాదం.

రెండోదశ నేను ఇండియా వెళ్లినప్పుడు. అడుగెట్టిన ప్రతి ఇంటా బ్రూయే. అని నాకు మహ గొప్ప హాచ్చెర్యమ్. "ఇంట్లో ఎవరూ మామూలు కాఫీ పెట్టుకోరేం" అన్నాను రహస్యంగా మాఅన్నయ్యతో.

మాఅన్నయ్య చిదానందుడిలా చిరునవ్వు నవ్వి, నా అమాయకత్వానికి జాలిపడి, "మామూలు కాఫీ మామూలు కాఫీయే. నువ్వు అమెరికానుండి వచ్చేవని నీకు స్పెషల్‌గా బ్రూ కలిపి ఇస్తున్నారు. ఈనాడు అదే వున్నత స్టేటసకి చిహ్నం" అన్నాడు.

ఆవిధంగా అమెరికానుండి దిగడిన నాకు నవనాగరీకం తాలూకు సూక్ష్మాలు కూడా అవగతమయేయి నాకు ఆరోజు. ఆతరవాత తిరుగు ప్రయాణానికి సిద్ధమవుతున్నవేళ, మాఅన్నయ్య "పండుగపూట వచ్చేవు. నీకు నచ్చినచీర తీసుకో" అన్నాడు.

"చీరేం చేసుకోను, ఏడాదికోమారు కడితే ఘనం. ఓచిన్న ఫిల్టరు కొనియ్యి. రోజూ నీపేరు చెప్పుకు మంచి కాఫీ తాగుతాను"

అన్నాను. అలా చీరెకి బదులు ఫిల్టరు పుచ్చుకుని ప్లేనెక్కేను. తెచ్చేనే కానీ, ఇక్కడ హొమొజినైజుడు పాలూ, అదీ ఫారంలోంచి ఫ్రీజరులోకి వచ్చేసరికే వారం రోజులు ... గట్టిగా నిజం చెప్పడానికి మనసొప్పదు కానీ అవి నిలవపాలే. మనగేదెపాల రుచి రమ్మన్నారాదు. ఆకాఫీ రుచి రాదు. ఇప్పటికి కాఫీ వైరాగ్యం రెండోదశకి వచ్చేసాను.

మూడోదశలో చెప్పుకోదగ్గది మాడైరెక్టరుగారి చేతిచలవ. ఆయనని ఓరోజు భోజనానికి పిలిచి, బుద్ధి గడ్డి తిని, "మాకాఫీ పేరు" అన్నాను.

"మీరెలా చేస్తారు?" అని అడిగారాయన సహజంగానే.

అమెరికనులు శిష్టావశిష్టులు. అరిటిపండు వొలిచి చేత బెడితే, ఏపక్కనించి కొరకాలని అడుగుతారు, మన మడీ ఆచారాల్లాగే ఇదీను. నీళ్లు కాచి ఫిల్టరులో పోయండి అంటే చాలదు. ప్రతిదీ స్టెప్ బై స్టెప్ తూకాలూ, కొలతలతో వివరించాలి.

మాడైరెక్టరుగారికి కాఫీ తయారు చేయు క్రమం చెప్పడం అవస్థ ఇలా వుంటుంది.

"ఒక క్వార్ట్ గిన్నెలో ఒక కప్పు నీళ్లు పోసి కాయాలి"

"ఎంతసేపు?"

"నీళ్లు మరిగేవరకూ."

"అంటే ఎంతసేపు?"

నేను ఆలోచించాను. మామూలుగా నేను నీళ్లు పొయ్యిమీద పెట్టి, నా ఈమెయిలు చూసుకుంటాను, మెయిలు మూట విప్పడానికి మూడు నిముషాలు పడుతుంది. ఇలా లెక్కలు గట్టి, "నాలుగు నిముషాలు" అన్నాను.

"టెంపరేచర్ ఎంత వుండాలి?"

"హైలో పెట్టండి. మీడియంలో పెడితే మరో రెండు నిముషాలు పడుతుంది."

ఇదీ ధోరణి. మీకు చెప్పక్కర్లేదు కదా ఈ ప్రొసీజరంతా. ఆపూటంతా నాకాఫీ రెసిపీతోనే గడిచిపోయింది.

ఆతరవాత మరో నాలుగు నెలలకి ఆయన ఇండియా వెళ్తున్నానన్నారు. ఆనవాయితీ ప్రకారం నేనూ ఏదో సలహా చెప్పాలికదా. అందరిలాగా తాజ్ మహల్ చూడండి, మామల్లపురం చూడండి అంటూ కొట్టినపిండే కొట్టడం ఎందుకని, నా ప్రత్యేకతని ఋజువు చేసుంటూ, "మద్రాసులో ఉడిపిహోటల్లో కాఫీ సేవించడం గొప్ప అనుభవం. అక్కడ సర్వరు చిన్నస్టీలు గిన్నే గ్లాసూ మధ్య కప్పు కాఫీ గజం పొడుగు సాగదియ్యడం మీరు చూసి తీరాలి. అది గొప్ప కళ" అని చెప్పేను.

ఆయన తిరిగొచ్చింతరవాత చెప్పేరు, "ఇప్పుడు అన్ని హోటళ్లలోనూ చైనా కప్పులే. నాహోస్టుని బతిమాలి రెండురోజులు ఊరంతా తిరగ్గా, మూడోరోజు మీరు చెప్పిన స్టీలు గిన్నె, గ్లాసుతో కాఫీలిచ్చే అయ్యరు హోటలు కనిపించింది. గొప్ప ఆర్టు. వరసగా మూజు రోజులు వెళ్లి పన్నెండు కప్పులు ఆర్డరు చేసి అబ్జర్వు చేసేను."

నన్ను కాఫీకి పిలిచారు ఆ ఆదివారం, తాను కూడా అలా స్టీలుగిన్నెలో గజం పొడుగు సాగదీసి కాఫీ నాకు సర్వ్ చెయ్యడానకి ముచ్చట పడుతూ. ఎలా కాదంటాను. సరే వస్తానన్నాను. అయన మరోసారి నన్నడిగి రెసెపీ జాగ్రత్తగా రాసుకున్నారు. నేనను మళ్లీ వివరాలు ఊహించుకుంటూ, నీళ్లు కాచడం దగ్గర్నించీ చెప్పేను శ్రాద్ధకర్మలా.

ఆదివారం మధ్యాన్నం టీవేళకి వెళ్లేను. (ఇచ్చేది కాఫీయే అయినా సమయం టీవేళే.)

మా డైరెక్టరు బల్లమీద పొందిగ్గా కాఫీ, బిస్కెట్లూ అమర్చారు. ఆతరవాత తాను కొనుక్కొచ్చిన స్టీలుగిన్నెలూ, గ్లాసులూ తెచ్చి, కాఫీ గిన్నెలో పోసి అచ్చంగా అయ్యరుహోటలులో సర్వరులాగే గజంపొడుగు సాగదీసారు.

నేను ఆశ్చర్యంగా చూస్తున్నాను ఆయన నేర్పు. ఆమాటే అన్నాను ఆయనతో.

ఆయన గంభీరంగా "చాలా సాధన చేసేను" అన్నారు, దిగులుగా కార్పెట్‌వేపు చూస్తూ. కార్పెట్‌మీద కాఫీమరకలు, నేను చిన్నప్పుడు వేసిన ఇండియా మాప్‌లా.

ఆయన నాముందుంచిన కాఫీ తెల్లగా వుంది మాపాపకిచ్చే కాఫీలా. మరీ మల్లెపూవులా కాకపోయినా, నీర్గావి పంచెలా. మర్యాదగా నవ్వుతూ గ్లాసు నోటబెట్టాను. పంచదార పానకం!

"ఎలావుంది" అన్నారు ఆయన నామొహంలోకి ఆతురతగా నామొహంలో కళలు పరికిస్తూ, పరీక్షాఫలితాలకోసం ఎదురు చూస్తున్న తొమ్మిదోక్లాసు కుర్రాడిలా. .

"షుగరెక్కువయినట్టుంది" అన్నాను తలొంచుకుని కళ్లనీళ్లు దాచుకుంటూ.

"మీరు చెప్పిన కొలతలే వేసేను మరి."

ఆఖరికి తేలిందేమిటంటే, ఆయన రాసుకోడంలోనో, రాసింది చూసుకోడంలోనో గల్లంతయి, నీళ్లూ, పంచదారా కొలతలు మారిపోయాయి.

అదే నాజీవితంలో కాఫీగురించి ప్రస్తావించడం. మళ్లీ ఎవరిదగ్గరా, ఎప్పుడూ మాకాఫీ పేరు అన్న పాపాన పోలేదు.

****